
సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం । 9 । జూన్ । 2023





**నగర వనం చూసొద్దాం రండి**
నెల్లిమర్ల పారిశ్రామిక వాడలోని సారిపల్లి సెంట్రల్ నర్సరీలో ఏర్పాటుచేసిన నగర వనం సందర్శకుల ఆకర్షిస్తోంది. - 8లో



**ఉత్సాహ భరితంగా ఉమెన్స్ టీ-20 క్రికెట్ లీగ్**
విజయనగరం వేదికగా జరుగుతున్న ఉమెన్స్ టీ-20 క్రికెట్ లీగ్ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగుతున్నాయి. - 8లో



**పనులు పూర్తి చేయండి**
అభివృద్ధిపనులు, తాగునీటి పథకాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పబ్లిక్ అండ్ హెల్త్ చీఫ్ ఇంజినీర్ పి.ఆనందరావు ఆదేశించారు. - 8లో

## న్యూస్‌రీల్

### రాష్ట్రపతి భవన్‌కు గిరిజనుల పయనం



రాష్ట్రపతిని కలిసేందుకు పయనమైన గిరిజనులు

**సీతంపేట:** సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 10 మంది గిరిజనులు గురువారం రాష్ట్రపతి భవన్‌కు పయనమయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 12న వీరితో భేటీకానున్నారు. విశాఖపట్నం నుంచి న్యూఢిల్లీకి ప్రత్యేక ట్రైన్‌లో వీరు వెళ్తున్నారు. దేశవ్యాప్తంగా రాష్ట్రపతిని కలిసేందుకు 1500ల మంది గిరిజనులను ఎంపిక చేయగా, అందులో మన రాష్ట్రం నుంచి వివిధ ఐటీడీఏల పరిధిలో 180 మంది ఎంపికయ్యారు. ఆదివాసీల జీవనం, వారి అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, సమస్యలపై చర్చిస్తారని ఐటీడీఏ అధికార వర్గాలు తెలిపాయి.

### చెవి ఆపరేషన్ సక్సెస్

**సీతంపేట:** స్థానిక ఏరియా ఆస్పత్రిలో చెవి ఆపరేషన్‌ను ఈఎన్‌టీ స్పెషలిస్టు శివకుమార్ విజయవంతంగా చేశారు. మండలంలోని తొరికవలసకు చెందిన ఆరిక ఎండయ్య చెట్టుపై నుంచి పడిపోయాడు. చెవికి తీవ్రమైన గాయమైంది. శస్త్ర చికిత్స చేసి చెవిని అతికినట్టు ప్రాంతీయ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు.

### 10న చెస్ క్రీడాకారుల ఎంపిక

**విజయనగరం:** రాష్ట్ర స్థాయిలో జరిగే అండర్-9 చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 10న నిర్వహించనున్నట్టు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కె.వి.జ్వాలాముఖి గురువారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి విజయనగరం రింగ్‌రోడ్‌లోని ఫైర్ చెస్ స్కూల్‌లో పోటీలు సాగుతాయన్నారు. 2014 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డులను వెంట తీసుకురావాలని సూచించారు. ఆ రోజు జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 97033 44488 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### సమగ్ర భూ సర్వే పరిశీలన



సమగ్ర భూ సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ సుదర్శనరావు

**వేపాడ:** మండలంలోని అరిగిపాలెం, చామలాపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో జరుగుతున్న భూముల సమగ్ర రీ సర్వేను ల్యాండ్ ఎక్విజేషన్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శనరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ సర్వేవల్ల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. రైతులు, సిబ్బంది పూర్తి సహకారం అందించాలని సూచించారు. మండలంలో సర్వే పూర్తయిన గ్రామాలు, సర్వే జరుగుతున్న గ్రామాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సన్యాసినాయుడు, మండల సర్వేయర్ అప్పలనాయుడు, సింగరాయి వీఆర్వో కె.సత్యవతి, గ్రామ సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

### బాధ్యతల స్వీకరణ



డీఎఫ్‌ఓ రామ్‌ప్రకాష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

**విజయనగరం క్రైమ్:** అగ్నిమాపకశాఖ జిల్లా అధికారిగా బి.వి.ఎస్.రామ్‌ప్రకాష్ జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. అగ్నిమాపకశాఖ పట్టణ అధికారి సోమేశ్వరరావు పుష్పగుచ్ఛంతో ఆయనకు స్వాగతం పలికారు. కడప జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌చార్జి డీఎఫ్‌ఓగా పనిచేసిన వినయ్ విజయవాడ బదిలీ అయ్యారు. నూతన బాధ్యతలు చేపట్టిన రామ్‌ప్రకాష్‌ను ఏపీ ఫైర్‌సర్వీస్ మెన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్, అధ్యక్షుడు ఆర్.వి.భాస్కర్, ఉపాధ్యక్షుడు కె.నాగరాజు, సభ్యులు అభినందనలు తెలిపారు.

# ఉద్యోగుల్లో జోష్

- ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు
- సీపీఎస్ స్థానంలో గ్యారంటీ పింఛన్ స్కీమ్ అమలు
- ప్రభుత్వ శాఖగా వైద్యవిధాన పరిషత్
- నాలుగు విడతల్లో 11వ పీఆర్‌సీ బకాయిల చెల్లింపు
- 12వ పీఆర్సీ కమిటీని నియమించిన ప్రభుత్వం
- జిల్లాలో 11,934 మంది ఉద్యోగులు, 6,559 మంది పింఛన్‌దారులకు ప్రయోజనం
- ఐదేళ్లు పూర్తిచేసుకున్న 1631మంది కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు
- హర్షంవ్యక్తం చేస్తున్న ఉద్యోగలోకం



కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులు

**పార్వతీపురంటౌన్:** వేతన జీవులకు భారీ ఊరట లభించింది. 11వ పీఆర్‌సీ బకాయిలను నాలుగు విడతల్లో చెల్లిస్తామని రాష్ట్ర కేబినెట్ హామీ ఇవ్వడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. 12వ పీఆర్‌సీ కమిటీ వేయాలని నిర్ణయం తీసుకోవడం ప్రభుత్వ ఉద్యోగుల్లో జోష్‌నింపింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి గ్యారెంటీ పెన్షన్ స్కీమ్‌ను తీసుకురావడంతో ఉద్యోగుల కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయడం.. జిల్లా కేంద్రాల్లో పని చేస్తున్న ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏను పెంచడం.. తదితర నిర్ణయాలతో ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఉద్యోగులకు వరాల జల్లులు కురిపించారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు పట్టరాని సంతోషంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం అంటే వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని చూసి నేర్చుకోవాలంటూ వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజాసంకల్పయాత్రలో తమ గోడు విన్నవించుకున్న వెంటనే ఆ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నిలబెట్టుకున్నారని కాంట్రాక్టు ఉద్యోగులు చెబుతున్నారు.

**జిల్లా వాసులకు లబ్ధి ఇలా..**

ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్)ను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రద్దు చేశారు. దాని స్థానంలో గ్యారంటీ పెన్షన్ స్కీమ్(జీపీఎస్)ను తీసుకొచ్చారు. జీపీఎస్ ఉద్యోగి పదవీ విరమణ పొందిన చివరి నెలలో తీసుకున్న జీతానికి కనీసం సగం పెన్షన్ కింద వస్తుంది. అలాగే, డీఏ కూడా రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా పెరిగేందుకు అవకాశం ఉంటుంది. జిల్లాలో 11,934 మంది ఉద్యోగులు, 6,559 మంది పింఛన్‌దారులకు ప్రయోజనం చేకూరనుంది.

**1631 మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ**

ప్రభుత్వ నిర్ణయంలో జిల్లాలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న 1631 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేశారు. 2014 జూన్ 5వ తేదీలోపు ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారందరి సర్వీసు రెగ్యులర్ అవుతుంది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టు ఉద్యోగులు సీఎం జగన్‌మోహన్ రెడ్డి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ప్రభుత్వ శాఖల్లో తొలిసారి కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని 1993లో రెగ్యులర్ చేశారని, మళ్లీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వారికి న్యాయం చేశారని ఉద్యోగ సంఘాల నాయకులు చెబుతున్నారు.

**ప్రభుత్వ శాఖగా వైద్యవిధాన పరిషత్**

ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ పేరుమార్చి వైద్య ఆరోగ్య శాఖ మాదిరిగానే ప్రభుత్వశాఖగా చేయాలని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం తమ జీవితాలను మార్చిందని వైద్యవిధాన పరిషత్ ఉద్యోగులు చెబుతున్నారు. దీనివల్ల 010 పద్దు కింద జీతాలు అందుతాయని, వైద్యవిధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరి ఇబ్బందులు తొలగిపోతాయంటున్నారు.

### ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెప్పండి

**జియ్యమ్మవలస:** కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి, జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలపాలంటూ జియ్యమ్మవలస మండలంలోని వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణిని కోరారు. చినమేరంగిలో పుష్పశ్రీవాణిని గురువారం కలిసి పుష్పశ్రీవాణికి పుష్పగుచ్ఛం అందజేశారు. జీవితాంతం జగనన్న మా గుండెల్లో కొలువై ఉంటారన్నారు.



కురుపాం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

### క్షీరాభిషేకం

**కురుపాం:** స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి గురువారం వైద్య ఆరోగ్య శాఖకు చెందిన హెల్త్‌అసిస్టెంట్లు, ల్యాబ్‌టెక్నీషియన్లు క్షీరాభిషేకం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులు ఆకుల మురళి, చల్లారావు, రాము, నారాయణరావు, ఆర్. సురేష్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడం చరిత్రాత్మక నిర్ణయమని, వందల సంఖ్యలో కాంట్రాక్టు ఉద్యోగులకు వెట్టిచాకిరీ నుంచి విముక్తి కలిగిందన్నారు. రాష్ట్రముఖ్య మంత్రికి రుణపడి ఉంటామన్నారు. అనంతరం జై జగన్ అంటూ నినదించారు. కార్యక్రమంలో కురుపాం, రేగిడి, జియ్యమ్మవలస, రామభద్రపురం పీహెచ్‌సీల నుంచి వైద్య ఆరోగ్యశాఖకు చెందిన కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

### రెండు పీఆర్‌సీలు ఇచ్చిన ఒకేఒక్క సీఎం

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక చంద్రబాబునాయుడు హయాంలో పెండింగ్‌లో ఉంచిన 11వ పీఆర్‌సీని విడుదల చేశారు. ఉద్యోగులకు 27 శాతం మధ్యంతర భృతితోపాటు 23 శాతం ఫిట్మెంట్ ఇచ్చి పెండింగ్ డీఏలు, హెచ్‌ఆర్‌ఏలు చెల్లించారు. ఇదే సమయంలో 12వ పీఆర్‌సీ కమిటీని కేబినెట్ సమావేశంలో వేయాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే కమిటీ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమై రెండు, మూడు నెలల్లోనే నివేదిక ఇచ్చే అవకాశం ఉంది. ఫలితంగా కేవలం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే రెండు పీఆర్‌సీలు ఇచ్చిన చరిత్ర మిగిలిపోతుంది. అంతేకాక పెండింగ్లో ఉన్న 11వ పీఆర్‌సీ బకాయిలను విడుదల చేయాలని నిర్ణయించారు.

### మాట నిలబెట్టుకున్నారు



2002వ సంవత్సరం నుంచి ఏపీ వైద్య విధాన పరిషత్ ద్వారా జిల్లా ప్రభుత్వాస్పత్రిలో కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాను. మా ఉద్యోగాలను ఎప్పుడు క్రమబద్ధీకరిస్తారా అని ఎదురుచూస్తున్నాం. ఎన్నికలకు ముందు జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రకు విచ్చేసినప్పుడు మా క్రమబద్ధీకరణపై విన్నవించాం. మా కలను సాకారం చేశారు. ఆయన మేలు మరచిపోలేం.

– **కొట్టిశ కిషోర్,** కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్, పార్వతీపురం జిల్లా ఆస్పత్రి

### ఉద్యోగుల పక్షపాతి



ఉద్యోగుల సమస్యలు తెలిసిన జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగడం మా అదృష్టం. ఇప్పటి వరకూ ఎవరూ చేయని విధంగా సమయానికే పీఆర్సీ కోసం కమిటీ వేయడం చారిత్రాత్మకం. డీఏ బకాయిలు అన్నీ ఇవ్వడంతో పాటు, ఇతర బకాయిలు కూడా చెల్లిస్తున్నారు. ప్రతి ఉద్యోగి ఆయనకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది.

– **వి.వి.రమణ.** వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, పార్వతీపురం మన్యం

### హర్షణీయం



12వ పీఆర్‌సీని నెల రోజుల ముందే ప్రకటించడం హర్షణీయం. ఇది ఉద్యోగులందరికీ ఉప యోగపడే మంచి పని. 11వ పీఆర్‌సీ బకాయిలను నాలుగు విడతల్లో చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. ఉద్యోగుల చాలా డిమాండ్లకు ప్రభుత్వం ఓకే చెప్పింది. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉద్యోగులందరూ హర్షిస్తారు.

– **జీవీఆర్ఎస్ కిషోర్,** ఏపీఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు, పార్వతీపురం మన్యం

### హామీలు నెరవేర్చారు



రాష్ట్ర ప్రభుత్వం హామీలు నెరవేర్చేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయం. ఒక్క సీపీఎస్ మినహా అన్ని హామీలు ఉద్యోగులందరికీ ఉపయోగపడేలా ఉన్నాయి. పీఆర్‌సీ బకాయిలు చెల్లిస్తామని చెప్పడం హర్షణీయం. కాంట్రాక్టు ఉద్యోగుల కోర్కెలు నెరవేర్చారు. గతంలో చంద్రబాబునాయుడు మినిమమ్ స్కేల్ అమలు చేస్తానని చెప్పి మోసం చేశారు. జగనన్న వచ్చిన తరువాత మా సమస్యను పరిష్కరించారు.

– **ఎస్.భరత్‌భూషణ్‌రాజు,** కన్వీనర్, ఉత్తరాంధ్ర ఎంప్లాయీస్ అసోషియేషన్

### జగనన్నకు కృతజ్ఞతలు



జూనియర్ లెక్చరర్లకు సీఎం జగన్ తీపికబురు అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,618 మంది కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను క్రమబద్ధీకరణ చేశారు. ఇది మా కుటుంబాల్లో వెలుగును నింపుతుంది. మా లాంటి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న జగనన్న మేలు మరువలేం. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– **అట్టాడ రామారావు,** కాంట్రాక్టు లెక్చరర్, సీతానగరం

## ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజం

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

**సాలూరు:** ప్రజలను ఉచిత హామీలతో మోసం చేయడం చంద్రబాబు నైజమని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలోని తన గృహంలో విలేకర్లతో గురువారం మాట్లాడారు. మోసపూరిత మేనిఫెస్టోలతో అన్ని వర్గాల ప్రజలను మోసం, దగా చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అర్హులైన ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం మరో శ్రీలంక అయిపోతుందని, అభివృద్ధి లేదంటూ టీడీపీ నాయకులు నాడు విమర్శలు చేశారని, నేడు వారే మరలా టీడీపీ మహానాడులో మహిళలు, రైతులకు రాష్ట్ర బడ్జెట్‌ను మించి ఉచిత పథకాలు ప్రకటించారన్నారు. 2014 ఎన్నికల్లో 650కు పైగా హామిలిచ్చిన చంద్రబాబు ఎన్ని హామీలను అమలుచేశారో తెలపాలన్నారు. ఎన్నికలు వేళ ప్రజలను మోసం చేసేందుకు మళ్లీ మాయనాడులో మినీ మేనిఫెస్టోను ప్రకటించారని దుయ్యబట్టారు. అన్ని వర్గాల ప్రజలను మోసం, దగా చేసిన చంద్రబాబును ప్రజలు నమ్మరన్నారు. చంద్రబాబు మోసగాడని, ఎవ్వరూ నమ్మవద్దని నాడు ఎన్‌టీఆర్ తెలిపిన మాటలను ప్రజలు మర్చిపోలేదన్నారు.

## సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చొరవ




వీడియోకాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

**పార్వతీపురం:** సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని కలెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో గురువారం వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ మేరకు పార్వతీపురం మండలం చుక్కవానివలస సంఘటనను కలెక్టర్ వివరించారు. చుక్కవానివలస గ్రామానికి చెందిన ఒక రైతు మ్యూటేషన్ కోసం మార్చి 6వ తేదీన అర్జీని సమర్పించారని, సరైన ధ్రువపత్రాలు సమర్పించకపోవడంతో ప్రత్యేక చొరవ చూపి.. పూర్వీకుల మరణ ధ్రువపత్రాల ఆధారంగా వన్ 'బి'ను జారీ చేశామన్నారు. అర్హులందరికీ అమ్మఒడి పథకం అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. నాడు–నేడు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, కావాల్సిన సిమెంట్‌ను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. గత వారంరోజుల్లో జిల్లా వ్యాప్తంగా రూ.7 కోట్ల విలువైన పనులు పూర్తిచేసినట్టు వివరించారు.

సమావేశంలో జేసీ ఆర్.గోవిందరావు, పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్వో జె.వెంకటరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎంవీఆర్ కృష్ణాజీ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ కె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

### గర్భిణులకు ప్రత్యేక వైద్యం



వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఐఓ జగన్మోహన్‌రావు

**పార్వతీపురంటౌన్:** గ్రామీణ పరిధిలోనే గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్టు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు తెలిపారు. అడ్డూరివలస, ఎమ్మార్‌నగరం, చినబొండపల్లి గ్రామాల్లో హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల్లో గర్భిణులకు అందుతున్న ఆరోగ్య సేవలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. హైరిస్క్ గర్భిణులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. గర్భిణులతో మాట్లాడి వైద్యసేవల వివరాలు తెలుసుకున్నారు. రక్తహీనతతో బాధపడేవారు రెండు పూటలా ఐరన్ మాత్రలు వేసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఎంఎస్ఎంఏ ప్రోగ్రాం కింద ప్రభుత్వాస్పత్రుల్లో గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. అయితే, ఆస్పత్రి వెళ్లే ముందు రోజు హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల్లో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం వల్ల వేచి ఉండాల్సిన అవసరం ఉండదన్నారు. ఆయన వెంట హెల్త్ సూపర్ వైజర్లు జయలక్ష్మి, జయగౌడ్, వైద్య సిబ్బంది ఊర్మిళ, నందిని, పద్మావతి, ఉష, పోలమ్మ, కమల, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

### గురుకులాల సమన్వయకర్తగా పద్మజ



బాధ్యతలు స్వీకరిస్తున్న పద్మజ

**విజయనగరం ఫూల్‌బాగ్:** విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల సమన్వయకర్తగా టి.పద్మజ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సమన్వయకర్తగా పనిచేసిన బి.చంద్రావతి హెడ్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. పద్మజను కార్యాలయ సిబ్బంది అభినందించారు.

## థాంక్యూ సీఎం సార్



ఎమ్మెల్యే జోగారావును సన్మానిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

**పార్వతీపురం టౌన్:** కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఆమోదం తెలపడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పార్వతీపురం జూనియర్ కళాశాల కాంట్రాక్ట్ లెక్చరర్లు, వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు ఎమ్మెల్యే అలజంగి జోగారావు క్యాంపు కార్యాలయం వద్ద సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యేను దుశ్శాలువతో సత్కరించారు. సీఎంకు కృతజ్ఞతలు తెలపాలని కోరారు. జగనన్నకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజయ్, లక్ష్మణరావు, శ్రీధర్, తారక్, ఎస్.శ్రీనివాసరావు, ఎ.రవి, జి.భార్గవ్, కె.శ్రీనివాసరావు, పి.రవిప్రసాద్, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సెలింగ్ సందడి



సీటు కేటాయించినట్టు స్లిప్ ఇస్తున్న డీడీ నగేష్ తదితరులు

- గురుకులాల్లో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు హాజరైన విద్యార్థులు
- పదోతరగతి మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు
- 430 సీట్లకు 907 మంది దరఖాస్తు

**సీతంపేట:** గిరిజన గురుకులాల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులతో సీతంపేట బాలుర గిరిజన గురుకుల కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. సీతంపేట ఐటీడీఏ పరిధిలో సీతంపేట బాలికలు, బాలుర కళాశాలలు, పెద్దమడి జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు 907 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో 430 మందికి సీట్లు లభించాయి. సీతంపేట గర్ల్స్ జూనియర్ కళాశాలలో 140 సీట్లకు 507, బాలుర కళాశాలకు 170 సీట్లకు 228 మంది దరఖాస్తు చేయగా, పెద్దమడిలో 120 సీట్లకు 107 మంది దరఖాస్తు చేశారు. కౌన్సెలింగ్‌ను గిరిజన సంక్షేమశాఖ డీడీ బి.నగేష్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయించామన్నారు. ప్రవేశాలు పొందిన వారంతా చక్కగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గురుకుల సెల్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, నోడల్ ప్రిన్సిపాల్ పైడి నాగభూషణరావు, ప్రిన్సిపాళ్లు పైడి సూర్యకుమారి, రేణుకేశ్వరరావు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### డీఎంహెచ్‌ఓను కలిసిన ఐఎంఏ ప్రతినిధులు



డీఎంహెచ్‌ఓ భాస్కరరావుకు అభినందనలు తెలియజేస్తున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్రనాయుడు, తదితరులు

విజయనగరం ఫోర్ట్: డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావును ఆయన చాంబర్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రతినిధులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.జయ చంద్రనాయుడు, డాక్టర్ వీఎస్. ప్రసాద్, డాక్టర్ ఉప్పు అప్పలరాజు, డాక్టర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆటో, కారు ఢీకొని నలుగురికి గాయాలు



రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గేదెల చిన్నమ్మి



కొత్తూరులో వైద్యసేవలు పొందున్న క్షతగాత్రుడు

భామిని: మండలంలోని అత్తికొత్తూరు సెంటర్‌లో గురువారం ఆటో–కారు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో నలుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. కొత్తూరు నుంచి గజపతినగరం వస్తున్న ఆటోను భామిని నుంచి కొత్తూరు వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడి నుజ్జునుజ్జయింది. కారు కూడా దెబ్బతింది. ఆటోలో ప్రయాణిస్తున్న గజపతి నగరానికి చెందిన గేదెల చిన్నమ్మి, గేదెల కృష్ణ, గొర్లె లక్ష్మణ గేదెల పాలోలు గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ రప్పించి కొత్తూరు సీహెచ్‌ఎన్‌సీకి క్షతగాత్రులను తరలించి వైద్యాధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో వైద్యసేవలు అందించారు. తీవ్రగాయాల పాలైన గేదెల చిన్నమ్మిని శ్రీకాకుళం రిమ్స్‌కు మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేసినట్లు వైద్యాధికారి తెలిపారు.

### నేడు, రేపు బబ్లింగ్‌పై విద్యార్థులకు అవగాహన

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ పరిధిలోని గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్లో ఆరవ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఓఎంఆర్ షీట్‌లో బబ్లింగ్‌పై శుక్ర, శనివారాల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ సిహెచ్.సంధ్య గురువారం తెలిపారు. దీనిని మోడల్ స్కూల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### శ్రీనివాసునికి పంచామృతభిషేకాలు



శ్రీక్షేత్రమ్‌లో శ్రీనివాసునికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్‌లో కొలువై ఉన్న శ్రీ అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసునికి గురువారం పంచామృతభిషేకాలు నిర్వహించారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయ అర్చకులు చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు, చామర్తి రమేష్ ఆచార్యులు సంయుక్తంగా వేదమంత్రాల నడుమ శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో దేవాలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

# నగర వనం చూసొద్దాం రండి

- ఆకట్టుకుంటున్న అడవి మృగాలు, పక్షుల శిల్పాలు
- చిన్నారులు ఆడుకోవడానికి సిద్ధంగా పార్కు



సారిపల్లి సెంట్రల్ నర్సరీలోని నగర వనం



చిల్డ్రన్ పార్కు



నగర వనం వ్యూ



చెట్ల కింద ఏర్పాటుచేసిన బెంచీలు



పక్షుల బొమ్మలతో కూడిన పార్కు



గుహలో గబ్బిలాలు, గుడ్లగూబ, కొండచిలువ శిల్పాలు



గిరినాగు శిల్పం



మ్యూజియంలో వన్యమృగాల శిల్పాలు

నెల్లిమర్ల: నెల్లిమర్ల పారిశ్రామిక వాడలోని సారిపల్లి సెంట్రల్ నర్సరీలో ఏర్పాటుచేసిన నగర వనం సందర్శకులకు అందుబాటులోకి వచ్చింది. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ వనంలో పిల్లలతో పాటు పెద్దలు సైతం తిలకించడానికి వన్యమృగాలు, పక్షులు, సర్పాల శిల్పాలతో కూడిన మ్యూజియం అందుబాటులో ఉంది. అన్నిరకాల అడవి జాతి మొక్కలు, వృక్షాలతో కూడిన రాశి వనంను ఇక్కడ ఏర్పాటుచేశారు. చిన్నారులు ఆడుకోవడానికి వీలుగా పలు రకాల ఆట వస్తువులతో కూడిన పార్కు సిద్ధం చేశారు. ఆహ్లాదకరంగా చెట్ల కింద కూర్చోడానికి సిమెంట్ బెంచీలను ఏర్పాటుచేశారు. సందర్శకుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను కల్పించారు. కొండపైకి ఎక్కే ట్రెక్కింగ్ పనులు ప్రస్తుతం చురుగ్గా జరుగుతున్నాయి. త్వరలోనే ఇది కూడా అందుబాటులోకి రానుంది. విజయనగరం నుంచి నెల్లిమర్లకు వెళ్లే దారిలో ఊటగెడ్డకు ముందు నెల్లిమర్ల పారిశ్రామిక వాడ, టిడ్కో కాలనీకి వెళ్లే మార్గంలో పూల్‌బాగ్ రిజర్వ్ ఫారెస్టులో 50 హెక్టార్లలో ఈ నగర వనం ఉంది. ఇక్కడి నుంచి 2 కిలోమీటర్ల దూరంలోనే చంపావతి నది తీరంలో వెయ్యేళ్ల చరిత్ర కలిగిన సారిపల్లి దిబ్బేశ్వరాలయం ఉంది. ఆలయానికి సమీపంలో ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ రవివర్మ ఆయుర్వేద ఎత్నిక్ విలేజ్(ఆశ్రమం) ఉంది. సారిపల్లి సెంట్రల్ నర్సరీలోని నగర వనాన్ని ఈ ఏడాది మార్చి 1 నుంచి సందర్శకులకు అందుబాటులో ఉంచామని డీఎఫ్‌ఓ శంబంగి వెంకటేష్ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నగర వనంలోకి సందర్శకులను అనుమతిస్తామన్నారు. సందర్శకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

# టైరు పేలి వ్యాన్ బోల్తా

- ఒకరి మృతి, 14 మందికి గాయాలు
- బాధితులంతా విజయనగరం జిల్లావాసులే



జాతీయ రహదారిపై బోల్తా పడిన వ్యాన్



మృతి చెందిన చిట్టిబాబు



క్షతగాత్రులను అంబులెన్సులో ఎక్కించడానికి తీసుకువెళ్తున్న బుడుమూరు గ్రామస్తులు

లావేరు: శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం బుడుమూరు వద్ద గురువారం ఉదయం వ్యాన్ బోల్తా పడిన ఘటనలో విజయనగరం జిల్లాకు చెందిన ఒకరు మృతి చెందగా, 14 మంది గాయపడ్డారు. లావేరు ఎస్సై ఎ.కోటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా డెంకాడ మండలం బంగార్రాజుపేట, కొండరాజుపేట, వల్లభపేట, ఉప్పాడపేట, అవ్వపేట గ్రామాలకు చెందిన చెందిన 15 మంది గురువారం ఉదయం వ్యాన్‌లో మేకలను తీసుకుని జలుమూరు మండలం తిలారు వద్ద జరిగే సంతకు బయలుదేరారు. లావేరు మండలం బుడుమూరు వద్దకు వచ్చేసరికి టైరు పేలిపోవడంతో వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వ్యాన్‌లో ఉన్న 15 మందితో పాటు మేకలు చెల్లాచెదురుగా జాతీయ రహదారిపై పడిపోయాయి. ఈ ప్రమాదంలో సరగడ చిట్టిబాబు(14) అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన 14 మందికి గాయాలయ్యాయి. కొన్ని మేకలు కూడ మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న వెంటనే బుడుమూరు గ్రామస్తులు స్పందించి మానవత్వం చాటుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. 108కు సమాచారం అందించి అంబులెన్సుల్లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. స్టేషన్ ఎస్సై కోటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది, హైవే పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. క్రేన్‌ను రప్పించి బోల్తాపడిన వ్యాన్‌ను రోడ్డు పక్కకు చేర్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఉత్సాహ భరితంగా ఉమెన్స్ టీ-20 క్రికెట్ లీగ్

- రాయలసీమ క్వీన్స్, వైజాగ్ డాల్ఫిన్స్ విజయం



రాయల సీమ క్వీన్స్ జట్టు



వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు విజయానందం

విజయనగరం: విజయనగరం వేదికగా జరుగుతున్న ఉమెన్స్ టీ-20 క్రికెట్ లీగ్ పోటీలు ఉత్సాహ భరిత వాతావరణంలో సాగుతున్నాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా గురువారం బెజవాడ బ్లేజర్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో రాయల సీమ క్వీన్స్ జట్టు 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడిన బెజవాడ బ్లేజర్స్ జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించి నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 97 పరుగులు జోడించింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన రాయలసీమ క్వీన్స్ జట్టు 17.2 ఓవర్లలో వికెట్ నష్టపోయి 98 పరుగులు జోడించి విజయం సాధించింది. మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్‌లో విజయనగరం రాయల్స్ జట్టుపై వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు 42 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించి నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 140 పరుగులు జోడించింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన విజయనగరం రాయల్స్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 98 పరుగులు మాత్రమే చేయగలిగింది.

### కోడిగుడ్ల ధరలు

| హోల్‌సేల్ ధరలు | (100 గుడ్లు) |
|---|---|
| విశాఖపట్నం | రూ. 515.00 |
| విజయనగరం | రూ. 519.00 |
| శ్రీకాకుళం | రూ. 519.00 |

### బులియన్

| విశాఖపట్నం | |
|---|---|
| బంగారం(24కి. 10గ్రా.) | 60,650-00 |
| బంగారం(22కి. 10గ్రా.) | 55,600-00 |
| వెండి (కిలో) | 77,000-00 |

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹175 | ₹330 | ₹ 330 |

# ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ



ప్రయాణికుడికి పర్సు ఇస్తున్న డిపో మేనేజర్ రమేష్, డ్రైవర్ శ్రీనివాసరావు

శృంగవరపుకోట: బస్సులో పర్సు పోగొట్టుకున్న వ్యక్తికి తిరిగి అందజేసి ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. గురువారం విజయనగరం నుంచి కొట్యాడ మీదుగా ఎస్.కోట వస్తున్న బస్సులో బొద్దాంలో దిగాల్సిన ప్రయాణికుడు తూర్పాటి రమేష్ పర్సు పోగొట్టుకున్నాడు. పర్సులో ఏటీఎం కార్డులు, రూ.2000 నగదు ఉన్నాయి. ఎస్.కోట డిపోలో బస్సు ఆగిన తర్వాత సిబ్బంది తనిఖీ చేయగా పర్సు దొరికింది. సిబ్బంది వెంటనే డిపో మేనేజర్ కె.రమేష్‌కు పర్సు అందజేశారు. దీంతో డిపో మేనేజర్ ప్రయాణికుడు రమేష్‌ను రప్పించి పర్సు అందజేశారు.

# త్వరితగతిన పనులు పూర్తి చేయండి

- వేగవంతంగా మంచి నీటి పథకాల నిర్మాణం
- పబ్లిక్ అండ్ హెల్త్ చీఫ్ ఇంజినీర్ పి. ఆనందరావు



అధికారులతో సమీక్షిస్తున్న పబ్లిక్ అండ్ హెల్త్ చీఫ్ ఇంజినీర్ ఆనందరావు



నెల్లిమర్లలో నిర్మాణంలో ఉన్న ఇన్‌ఫిల్టరేషన్ బావులు

విజయనగరం: కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల్లో చేపడుతున్న అభివృద్ధిపనులతో పాటు నూతనంగా నిర్మిస్తున్న మంచి నీటి పథకాల పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని పబ్లిక్ అండ్ హెల్త్ చీఫ్ ఇంజినీర్ పి.ఆనందరావు ఆదేశించారు. ఈ మేరకు విజయనగరం, విశాఖ, పార్వతీపురం-మన్యం, శ్రీకాకుళం జిల్లాల పర్యటనలో భాగంగా గురువారం ఆయన నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న ఇన్‌ఫిల్టరేషన్ బావులు, గ్యాలరీని పరిశీలించారు. అనంతరం విజయనగరం పెద్ద చెరువులో గల మరుగునీటి శుద్ధి ప్లాంట్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య సాంకేతిక ఇంజినీరింగ్ అధికారులతో తాగునీటి సరఫరా, అర్బన్ హెల్త్ క్లినిక్స్ నిర్మాణం, 15 వ ఆర్థిక సంఘం నిధులతో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో ఏషియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ వారి నిధులతో సమగ్ర మంచి నీటి సరఫరా పథకాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆ పనులు వేగవంతం చేసి ప్రజలకు అవసరమైన తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్‌లను త్వరితగతిన పిలిచి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఆయన వెంట పబ్లిక్ అండ్ హెల్త్ పర్యవేక్షక ఇంజినీర్ కె.రాజారావు, నాలుగు జిల్లాల కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు, సహాయక ఇంజినీర్‌లు పాల్గొన్నారు.

# ప్రియుడు లేని బతుకు వ్యర్థమని..!

- గన్నేరు పిక్కలు మింగి యువతి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన పుష్పవతి

గుమ్మలక్ష్మీపురం: ప్రియుడు లేని లోకంలో తాను జీవించలేనని, తన జీవితం వ్యర్థమైపోయిందని మనస్తాపం చెందిన ఓ యువతి గన్నేరుపిక్కలు తిని ఆత్మహత్యకు పాల్పడింది. గుమ్మలక్ష్మీపురం మండలంలో జరిగిన ఈ విషాద సంఘటనపై ఎల్విన్‌పేట ఎస్సై ఎస్.షన్ముఖరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డొంగరికిక్కువ గ్రామానికి చెందిన కోలక కిశోర్ పాముకాటుకు గురై చికిత్స పొందుతూ వారం క్రితం మృతిచెందాడు. వరుసకు బావ అయిన కిశోర్‌తో ప్రేమలో ఉన్న అదే గ్రామానికి చెందిన తాడంగి పుష్పవతి (19) కిశోర్ మరణాన్ని జీర్ణించుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి గన్నేరుపిక్కలు నూరి మింగేసింది. అపస్మారక స్థితిలో ఉన్న పుష్పవతిని గుర్తించిన కుటుంబసభ్యులు కురుపాం ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్య సేవల అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి చిన్నప్పుడే చనిపోగా తల్లి లక్ష్మి అన్నీ తానై చూసుకునేది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

#### పురుగు మందు తాగి యువకుడు..

బొబ్బిలి: మండలంలోని రెడ్డియ్యవలసకు చెందిన సాంగలి గణేష్(21) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. డిగ్రీ పూర్తిన గణేష్ ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. ఏమైందో ఏమో కానీ బుధవారం రాత్రి పురుగు మందు తాగేశాడు. ఈ విషయం గుర్తించిన కుటుంబసభ్యులు బొబ్బిలి సీహెచ్‌సీకి గణేష్‌ను తీసుకురాగా ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సిఫార్సు మేరకు విజయనగరం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలపై కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

#### చీమల మందు తాగి వ్యక్తి..

పాచిపెంట: భార్య మందలించిందని మనస్తాపానికి గురైన వ్యక్తి చీమల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం పాచిపెంట మండలంలో జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పద్మాపురం పంచాయతీ పిండ్రంగివలస గ్రామానికి చెందిన డి.రాజు మద్యానికి బానిసై భార్యతో తరచు గొడవపడేవాడు. ఈ క్రమంలో పదిరోజులక్రితం భార్యతో గొడవ పడగా ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. బుధవారం ఉదయం మద్యం తాగిన రాజు భార్య వద్దకు వెళ్లి ఇంటికి రావాలని కోరగా నిరాకరించింది. దీంతో మనస్తాపం చెంది సాయంత్రం చీమల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సాలూరు ఏరియాఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మునలయ్య తెలిపారు.

# ఆకట్టుకున్న కథా శిక్షణ



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతుల కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన కథా శిక్షణ కార్యక్రమం విద్యార్థులను ఆకట్టుకుంది. తెలుగు భాషపై పట్టు పెంచడంతో పాటు కథలు రాయడం, కథా పఠనం వంటి అంశాలపై విద్యార్థులకు శిక్షణ అందజేశారు. కథా అంశాలను స్వయంగా తీసుకునే విధానం నేర్పించారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన 40 మంది బాల బాలికలకు ఉపాధ్యాయుడు ఆర్.ఈశ్వర్ శిక్షణ ఇచ్చారు. అనంతరం తన్మయి, షణ్ముఖ ప్రియ, సాహితీ ప్రియ నిర్వహించిన సంగీత, నృత్య కార్యక్రమం అలరించింది. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

# ఎంత కష్టపడుతున్నా కానీ..!

- టీడీపీ కార్యకర్తల సమావేశంలో బేబీనాయన ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న బేబీనాయన

బొబ్బిలి: పార్టీ కోసం రోజూ ఎన్నో గ్రామాలు తిరుగుతున్నాను. ఎందరినో కలిసి పార్టీ కార్యక్రమాలను వివరిస్తున్నాను. అయితే తెలుగుదేశం పార్టీకి అవేమీ చాలవట. పార్టీ యాప్ మై టీడీపీలో వాటిని నమోదుచేసి అప్‌లోడ్ చేయాలట. యాప్‌లో బొబ్బిలి నియోజకవర్గం అట్టడుగున ఉందట. అని బొబ్బిలి టీడీపీ ఇన్‌చార్జి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు కారకర్తల మధ్య ఆవేదన వెళ్లగక్కారు. ఉనికి కోసం పాట్లు పడుతున్న టీడీపీ ఓ యాప్ పెట్టుకుంది. దానిని అనుసరించడంలో బొబ్బిలి నియోజకవర్గం అట్టడుగున ఉందని పార్టీ అధిష్టానం నుంచి సమాచారం వచ్చింది. ఈ విషయం సాక్షాత్తూ నియోజకవర్గ సమావేశంలో టీడీపీ కార్యకర్తలకు బేబీనాయన వెల్లడించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం పట్టణంలోని కోటలో నియోజకవర్గ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు.